

## ఏసీబీకి చిక్కిన డిప్యూటీ డీసీటీవో

**10 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వెంకటేశ్వర్‌రెడ్డి**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3: లంచం తీసుకుంటూ డిప్యూటీ డీసీటీవో ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన మంగళవారం మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఈ మేరకు ఏసీబీ అడిషనల్ ఎస్పీ కృష్ణ గౌడ్ వివరాలు వెల్లడించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పిల్లిగుండు తండాకు చెందిన రాత్లావత్ సంతోష్ నాయక్ మహబూబ్‌నగర్‌లోని మర్లులో వ్యాపారం కోసం ఓ దుకాణం అద్దెకు తీసుకున్నాడు. జీఎస్టీ లైసెన్స్ కోసం గత నెల 17న జడ్చర్లలో సీఐ ఉస్మాన్‌ను సంప్రదించి 'మీ సేవ'లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు డిప్యూటీ డీసీటీవో వెంకటేశ్వర్‌రెడ్డి గత నెల 22న దుకాణంలో తనిఖీ చేశాడు. దుఖాణం నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని, లైసెన్స్ రద్దు చేస్తానని చెప్పాడు. ఏమైనా ఉంటే చెల్లిస్తానని దుకాణం యజమాని చెప్పడంతో రూ.50 వేలు ఇవ్వాలని వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. అంత ఇవ్వలేనని చెప్పగా.. రూ.10 వేలకు ఒప్పందం కుదిరింది. అనంతరం బాధితుడు ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ప్లాన్ ప్రకారం.. మంగళవారం మహబూబ్‌నగర్ న్యూటౌన్‌లోని డిప్యూటీ డీసీటీవో కార్యాలయంలో నగదు అందిస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారించారు. అధికారిది గద్వాల జిల్లా కేంద్రం కావడంతో అక్కడా ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. నిందితుడిని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించినట్టు ఏఎస్పీ తెలిపారు.

## బాధితుల పేర్లు వెల్లడించం: ఏసీబీ

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అవినీతి నిరోధక శాఖ కేసుల్లో ఇక నుంచి బాధితుల పేర్లను వెల్లడించబోమని ఏసీబీ మంగళవారం ప్రకటించింది. కొన్ని భద్రతా కారణాల రీత్యా బాధితుల పేర్లను అత్యంత గోప్యంగా ఉంచనున్నట్టు వెల్లడించింది. ఏసీబీ కేసుల్లో పట్టుబడిన తర్వాత సంబంధిత అధికారుల నుంచి, వారి బంధు వర్గం నుంచి బాధితులకు ముప్పు పొంచి ఉండటంతోనే ఈ జాగ్రత్తలు తీసుకునేందుకు నిర్ణయించినట్టు తెలిపింది. ఇక నుంచి బాధితులెవరైనా నిర్భయంగా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని కోరింది.

## అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై కొరడా

**ఐలాపూర్ తండాలో భారీ ఎత్తున కూల్చివేతలు**

అమీన్‌పూర్, సెప్టెంబర్ 3: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ తండా పంచాయతీ పరిధిలో మంగళవారం అధికారులు అక్రమ కట్టడాలుగా పేర్కొంటూ కూల్చివేతలు చేపట్టారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో అక్రమ కట్టడాలతోపాటు సర్వే నంబర్ 462ని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాలను తహసీల్దార్ రాధా ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య నేలమట్టం చేశారు. మంగళవారం తెల్లవారుజామున రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పోలీస్ బలగాలతో వచ్చి కూల్చివేతలు చేపట్టారు. 462 సర్వే నంబర్‌లో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డికి సంబంధించిన నిర్మాణాలను కూలుస్తున్నట్టు సమాచారం అందుకొన్న కార్యకర్తలు, అనుచరులు అక్కడికి చేరుకొని రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. పూర్తిస్థాయి సర్వే నిర్వహించిన తరువాతే కూల్చివేతలు చేపట్టాలని చైర్మన్ పాండురంగారెడ్డి ఆందోళనకు దిగారు. ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకోండి అంటూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అదే సర్వే నంబర్‌లో ఫ్యూజన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు సంబంధించిన ప్లేగ్రౌండ్‌తో పాటు ప్రహరిని ధ్వంసం చేశారు.

**నిబంధనలకు విరుద్ధంగా**

అమీన్‌పూర్‌లో అధికారులు నియంతగా వ్యవహరిస్తున్నారు. న్యాయస్థానాలను సైతం లెక్కచేయడం లేదు. ఇటువంటి కక్షసాధింపు చర్యలు ఉంటాయని, గుర్తించి అధికార కాంగ్రెస్‌లో చేరినప్పటికీ వేధింపులు తప్పడం లేదు.

– పాండురంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్

# ప్లీజ్ మీ లంచం వాపస్ తీసుకోండి!

- ఏసీబీ వరుస దాడుల నేపథ్యంలో సెట్‌రైట్
- లంచమిచ్చిన వ్యక్తుల కోసం వెతుకులాట
- ఇచ్చిన డబ్బు వాపస్ ఇచ్చేస్తున్న కాప్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): 'పైసలు లేనిదే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు కావు' అనే నానుడి ఉన్నది. ఆ నానుడిని నిజం చేస్తూ ఎందరో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది లంచానికి అలవాటుపడ్డారు. ఇటీవల కాలంలో మరీ రెచ్చిపోతున్నట్టు వరుస ఏసీబీ దాడులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిత్యం ఏదో ఒకచోట ఏసీబీ అధికారులు దాడులకు దిగుతున్నారు. ఫలితంగా లంచాలకు మరిగిన వారిలో భయం కలిగింది. తమపై ఎక్కడ ఫిర్యాదు చేస్తారోననే గుబులుతో తీసుకున్న లంచం సొమ్మును ఇచ్చిన వ్యక్తులకే తిరిగిచ్చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో పని



చేసి మరోచోటుకు బదిలీ అయిన ఓ ఎస్సై ఉదంతం చర్చనీయాంశంగా మారింది. ఓ దుకాణ యజమాని నుంచి గతంలో తీసుకున్న రూ.15 వేల లంచం సొమ్మును అతన్ని వెతికి మరీ అతడున్న చోటుకే వెళ్లి ఆ ఎస్సై తిరిగివ్వడం గమనార్హం.

**15 వేల లంచం సొమ్ము తిరిగిచ్చేసిన ఎస్సై!**

'సార్ మీరెక్కడున్నారు? మిమ్మల్ని ఓ సారి కలవాలి! నేనొస్తా సార్.. నోనో నేనే మీ వద్దకు వస్తా.. ప్రస్తుతం మీరెక్కడున్నారో చెప్పండి చాలు' అంటూ దుకాణ యజమానికి ఆ సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఇటీవల వచ్చిన ఫోన్‌కాల్ ఇది. ఆ ఎస్సై మాట కాదనలేక ఆ దుకాణం యజమాని మలక్‌పేట్‌లో ఉన్నానంటూ చెప్పారు. గంట వ్యవధిలోనే సదరు ఎస్సై అతనిని వచ్చి కలిశాడు. కుటుంబ మంచిచెడ్డలు, వ్యాపార బాగోగుల గూరించి కొద్దిసేపు మాట్లాడాడు. ఆ తర్వాత తన జేబులో నుంచి రూ.15 వేలు తీసి, సదరు దుకాణ యజమాని చేతిలో పెట్టాడు. నా మాట కాదనకండా మీరిచ్చిన డబ్బు వెనక్కి తీసుకోండి. మీకు నేను ఎలాంటి సహాయం చేయలేకపోయానంటూ ఆ వ్యాపారికి ఎస్సై నచ్చజెప్పి వెళ్లిపోయాడు. అయ్యో ఏంది సార్ ఇది.. అని అంటుండగానే ఆ ఎస్సై అతని మాట వినకుండా తానొచ్చిన బైక్‌పై వెళ్లిపోయాడు.

### జరిగింది ఇదీ!

హైదరాబాద్ వెస్ట్‌జోన్ పరిధిలో నిరుడు చివరలో ఒక స్పా సెంటర్ నిర్వాహకులకు, ఆ ఇంటి యజమానికి ఏర్పడిన వివాదం పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లింది. ఇరు పార్టీలతో ఏసీపీ, సీఐలు మాట్లాడారు. ఆ కేసు దర్యాప్తు జరుపుతున్న ఎస్సై మాత్రం బాధితులతో మంచిగానే ఉంటూ, ఖర్చుల కోసం ఎంతో కొంత ఇవ్వాలంటూ తన సిబ్బందితో విషయాన్ని ఫిర్యాదుదారులకు చేరవేశాడు. దీంతో వారు ఒక ఎస్సైకి రూ.15 వేలు లంచం అందజేశారు. ఆ కేసు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది. విచారణ జరుగలేదు, ఫిర్యాదుదారుకు న్యాయమూ జరుగలేదు. కొన్నిరోజుల తర్వాత ఆ ఎస్సై అక్కడి నుంచి బదిలీ అయ్యాడు. ఏసీబీ దాడులు, అధికారులు హెచ్చరికలతో జంకిన ఆ ఎస్సై రూ.15 వేలు లంచంగా ఇచ్చిన వ్యక్తిని వెతికి మరీ తిరిగి ఇచ్చేయడం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది.



ఫార్మాసిటీకి వ్యతిరేకంగా సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాస్తారోకో, ధర్నా చేస్తున్న వివిధ పార్టీల నాయకులు, భూబాధితులు, ప్రజలు

# ఫార్మాసిటీ వద్దే వద్దు

- మాకు జీవనాధారమైన భూములిచ్చేది లేదు
- సంగారెడ్డి జిల్లా న్యాల్ కల్ లో బాధితుల ధర్నా


న్యాల్‌కల్, సెప్టెంబర్ 3: ఫార్మాసిటీ వద్దే వద్దని, జీవనాధారంగా సాగుచేసుకుంటున్న భూములను ఇచ్చేది లేదని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాలకు చెందిన భూ బాధితులు, ప్రజలు స్పష్టంచేశారు. మంగళవారం న్యాల్‌కల్‌లో ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, భూబాధితులు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లోని న్యాల్‌కల్–ముంగి ప్రధాన రోడ్డు మార్గంలో రాస్తారోకో, ధర్నా చేశారు. ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణాలు పోయినా సరే.. ఫార్మాసిటీకి భూములు ఇవ్వబోమని స్పష్టంచేశారు. ఫార్మాసిటీతో ఈ ప్రాంతమంతా విషపూరితమయ్యే ప్రమాదముందని తెలిపారు. పచ్చని పొలాలు గుంజుకుని ఫార్మాసిటీ పేరుతో కోట్లాది రూపాయలు దండుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం చేస్తే ప్రాణాలైనా ఇస్తాంగానీ.. భూములు మాత్రం వదులుకునేది లేదని తేల్చిచెప్పారు. తమ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటు ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సూచించారు. ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకునే వరకూ పార్టీలకతీతంగా ప్రజలు, రైతులందరూ కలిసి మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆనంతరం తహసీల్దార్ భూపాల్‌ను కలిసి ఫార్మాసిటీకి భూములు మాత్రం ఇచ్చేది లేదంటూ వినతిపత్రాన్ని అందజేశారు.

# ముని్సపల్‌శాఖలో 400 రహస్య జీవోలు!

- వెబ్ సైట్‌లో కనిపించేవి 8 మాత్రమే
- ప్రతిపక్షంలో ఉండగా జీవోలన్నీ వెబ్ సైట్‌లో పెట్టాలని డిమాండ్
- నేడు ఆచరణలో మాత్రం శూన్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ శాఖలో ఏం జరుగుతున్నది? అంటే అంతా రహస్య జీవోల తతంగం నడుస్తున్నది అని అర్థమవుతున్నది. ఎందుకలా అంటే.. ఆ శాఖలో ఇప్పటి వరకు మొత్తం 390 జీవోలు విడుదల కాగా, అందులో కేవలం 8 మాత్రమే అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అంటే.. రెండు శాతం జీవోలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నమాట. మిగిలిన 98 శాతం జీవోలు రహస్యంగా ఉంచారు. దీనిపై సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. ఏ సంస్థలకు ఎలాంటి మినహాయింపులు, రాయితీలు, సబ్సిడీలు, విధానపరమైన నిర్ణయాల్లో ఎవరెవరికి లబ్ధి చేకూర్చారోనని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు ప్రజలకు తెలుసుకోవడానికి అవకాశం లేకుండా రహస్యాన్ని పాటిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండగా.. జీవోలన్నీ వెబ్‌సైట్‌లో పెట్టాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ ముఖ్యనేతలే ఇప్పుడు జీవోలను రహస్యంగా ఎందుకు ఉంచుతున్నారని ప్రశ్నిస్తున్నారు. అత్యంత కీలకమైన మున్సిపల్‌శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, ఓఆర్ఆర్, మూసీ నది, మెట్రో రైలు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, డీటీసీపీ, సీడీఎంఏ భాగం. అలాంటి శాఖలో జీవోలను రహస్యంగా ఉంచటం అనేక అనుమానాలకు తావిస్తున్నది. సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకొనే హక్కు ప్రజలకు ఉన్నదని స్పష్టం చేస్తున్నారు. 'పంచాయతీరాజ్ శాఖలోనూ గత జనవరి నుంచి మొత్తం 480 జీవోలు జారీఅయ్యాయి. ఈ శాఖ వెబ్‌సైట్‌లో 26 జీవోలను మాత్రమే పొందుపరిచారు. మిగిలినవన్నీ రహస్యంగానే ఉన్నాయి. ఈ రెండు శాఖల్లోనే కాకుండా దాదాపు ప్రతి శాఖలో ఇదే పరిస్థితి ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా జీవోలన్నింటనీ బహిర్గతం చేయాలి. అందరికీ అందుబాటులో ఉండేలా వెబ్‌సైట్‌లో ఉంచాలి' అని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న కీలకమైన జీవోలన్నీ రహస్యంగా ఉంచుతున్నారని.. అందుకు మాజీ ఐపీఎస్ అంజనేయరెడ్డి నియామకమే ఉదాహరణ అని పేర్కొంటున్నారు.

- బోరుబావి నుంచి ఉబికివస్తున్న నీరు



నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం సజనాపూర్‌లో బోరుబావి నుంచి నీరు ఉబికి వస్తున్నది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో సజనాపూర్‌లో సూర్మి రఘు అనే రైతుకు చెందిన బోరులో మోటర్ స్టార్ట్ చేయకుండానే నీరు ఉబికి వస్తున్నది. – దామరగిద్ద

# ఫార్మా సిటీ ఉన్నదా? లేదా?

**ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు**

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మా సిటీ ఉన్నదో లేదో చెప్పాలని, దీనిపై 6 లోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫార్మా సిటీ రద్దయినట్టు పత్రికల్లో వచ్చిన కథనం ఆధారంగా తాము నిర్ణయానికి రాలేమని తేల్చిచెప్పింది. ఫార్మా సిటీ ఏర్పాటు నిమిత్తం సేకరించిన భూముల పరిహార అవార్డు చెల్లదని గతంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చినందున తమ భూములపై ఉన్న ఆంక్షలను రద్దు చేయాలని కోరుతూ మేడిపల్లికి చెందిన 49 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ మంగళవారం విచారణ జరిపారు. ఫార్మా సిటీ భూసేకరణ కోసం 2017లో జారీచేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించకుండానే పరిహార అవార్డు నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుపడుతూ నిరుడు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారని పిటిషనర్ల తరపు న్యాయవాది చెప్పారు. ప్రభుత్వం ఫార్మా సిటీని రద్దు చేసినట్టు పత్రికల్లో కథనాలు వచ్చాయని, దీంతో రైతుల భూములపై ఆంక్షలను ఎత్తివేసి, మ్యుటేషన్లకు వీలుకల్పించాలని కోరారు. ప్రభుత్వం తరపు న్యాయవాది దివ్య ప్రతివాదన చేస్తూ.. పిటిషనర్లు వాస్తవాలు చెప్పలేదని, పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా అసత్యాలతో కోర్టుకు వచ్చారని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. అసలు ఇంతకీ ఫార్మా సిటీ ఉన్నదో? లేక రద్దయిందో చెప్పాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. అప్పటి వరకు ఈ పిటిషన్‌లోని అంశాల జోలికి వెళ్లబోమని స్పష్టం చేస్తూ.. విచారణను 6కు వాయిదా వేశారు.

# డెంగ్యూతో చిన్నారి మృతి




తాళ్ల శ్రీనిత్య (ఫైల్)

ఆత్మకూరు, సెప్టెంబర్ 3 : హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనిత్య (12) డెంగ్యూతో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. శ్రీనిత్య కుటుంబం ప్రస్తుతం వరంగల్‌లో నివాసం ఉంటుండగా అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నది. వారం రోజులుగా జ్వరం వస్తుండగా, రెండు రోజుల క్రితం తీవ్రమైంది. వెంటనే ఆమె తల్లి సునీత పాపను హనుమకొండలోని దవాఖానలో చేర్పించగా డెంగ్యూ నిర్ధారణ అయింది. ఈ క్రమంలో చికిత్స అందిస్తుండగానే మంగళవారం మృతి చెందినట్టు ఆమె పేర్కొన్నారు.

### నిధుల స్వాహాలోకి ఈడీ ఎంట్రీ

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ) : పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో రూ.1.72 కోట్లు కాజేసిన ఉద్యోగి కేసరి సతీశ్, అతని బంధువు దువ్వా వీరేశ్‌కుమార్‌పై ఈడీ నాంపల్లి కోర్టులో పీఎంఎల్ఏ చట్టం కింద అభియోగాలు మోపింది. వరంగల్ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పరిధిలోని కొడకండ్లలో సబ్ పోస్టమాస్టర్‌గా పనిచేసిన సమయంలో సతీశ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు కేసు నమోదు అయ్యింది.

- మీకు రుణమాఫీ కాలేదు



APGVB
Registered Notice
అప్పు చెల్లింపుటకై నోటీసు
తేది:16-08-2024

ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు
SHANKARAMPET (R)
Shankarampet (R) vil
MEDAK District
Telangana State

శ్రీ/శ్రీమతి - Mr. AENUGULA RADAMMA
తండ్రి/భర్త -NARAYANA
GAJAGATLAPALLY
SHANKARAMPET R , MEDAK DIST -502248

మీ ఋణ ఖాతా నెంబరు: 73061502010

RN112682684IN

వ్యవసాయ ఋణము

అమ్మ / అయ్యా,

మీరు మా బ్యాంకు లో 20-08-2020 తేదీన వ్యవసాయ అవసరం నిమిత్తం రూ. 145000.00 ఋణము తీసుకొని ఉన్నారు. ఇట్టి ఋణం తేది 16-08-2024 నాటికి రూ. 113083.66 (వడ్డీ అదనం) చెల్లించవలసి ఉన్నది . ఇట్టి ఋణాన్ని, ఋణ ఒప్పందం /అంగీకారము ప్రకారం 12 నెలలు లోగ తిరిగి చెల్లించిన యెడల మీరు పొందిన ఋణము పైన 7 % వడ్డీ విధించబడును. అలా చెల్లించని/ పున రుద్ధించిన యెడల, ఋణ ఒప్పందం ప్రకారం ఒక సంవత్సరం పై బడిన కాలానికి 14% వడ్డీ చెల్లించవలసి ఉంటుంది. అందు చేత, మీ ఋణము చెల్లించి అరత్హ ను బట్టి తిరిగి అధిక పరపతి ని పొందగలరు.

2. అదే విధముగా, మీరు పొందివున్న వ్యవసాయ ఋణము ను పునరుద్ధరణ చెసుకొనే గడువు తేది 19-08-2021 నాడు ముగుస్తున్న సందర్భంగా,మీ ఋణా ఖాతా ను బ్యంకు కు వచ్చి పునరుద్ధరణ/రెన్యువల్ చెసుకొగలరని తెలియ చెస్తున్నాము.

3. ఈ నోటీసు పంపిచటకు అయిన ఖర్చు రూ 59మీ ఋణ ఖాతా కు ఖర్చు రాయడమయినది

భవదీయుడు,
శాఖ నిరవ హణాధకారి.

SHANKARAMPET (R) శాఖ

'మీ రుణం మాఫీ కాలేదు. వెంటనే డబ్బులు చెల్లించాలి' అంటూ బ్యాంకు అధికారులు నోటీసులు పంపిస్తున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల గజగట్లపల్లికి చెందిన ఏనుగుల రాధమ్మ చిన్నశంకరంపేటలోని ఏపీజీవీబీలో 20 ఆగస్టు 2020న రూ. 1.45 లక్షల పంట రుణం తీసుకున్నది. అర్హతలున్నా మాఫీ కాలేదు. దీంతో బ్యాంక్ అధికారులు రుణాన్ని చెల్లించాలంటూ 16న నోటీసులు జారీ చేశారు. ఆ మహిళా రైతు ఏడాది క్రితమే మృతి చెందింది. ఇలాంటి నోటీసులే మరికొంతమంది రైతులకూ పంపించారు. – చిన్నశంకరంపేట

# గురుకులాల్లో ఆర్సీవోల చేతివాటం!

- గెస్ట్, పార్ట్‌టైం ఫ్యాకల్టీల ఎంపికలో అవినీతి దందా
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2,500-3,000 ఖాళీలు
- పాతవారికి అవకాశమివ్వకుండా మళ్లీ కొత్తవారితో భర్తీ
- ఒక్కో అభ్యర్థి నుంచి 50 వేల నుంచి లక్ష వరకు వసూలు
- నిజామాబాద్, కమలాపూర్‌లో ఆరోపణల పరంపర

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): నిజామాబాద్ జిల్లాలో మైనార్టీ గురుకులానికి చెందిన ఓ ఉన్నతాధికారి గెస్ట్ ఫ్యాకల్టీలుగా ఉద్యోగావకాశం కల్పిస్తామని చెప్పి అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేశారని బయటకు పొక్కింది. కేసులదాకా వెళ్లినట్టు ఇటీవలే వెలుగుచూసింది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ గురుకులంలోనూ ఇదే రీతిన పోస్టులను భర్తీ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొందరు గురుకులాల ఆర్సీవోలు అవినీతి దందాకు తెరలేపినట్టు తెలుస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో గెస్ట్, పార్ట్‌టైం ఉద్యోగులుగా పదేండ్లపాటు విద్యాబోధన చేసిన వారిని ఇటీవలే తొలగించారు. పర్మినెంట్ ఉద్యోగాల భర్తీ చేపట్టడంతో పాతవారిని వద్దని పక్కనపెట్టారు. సొసైటీల్లో నియామక ఉత్తర్వులు తీసుకున్న వారిలో 1,700 మంది అభ్యర్థులు ఇప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరలేదని తెలుస్తున్నది. పదుల సంఖ్యలో అభ్యర్థులు గురుకుల పోస్టులను వదులుకున్నట్టు సమాచారం. మొత్తంగా అన్ని సొసైటీల్లో అన్ని క్యాడర్లలో 2,500 నుంచి 3,000 పోస్టులు ఖాళీగా మిగిలినట్టు సమాచారం. ఖాళీల స్థానంలో ఏండ్ల తరబడి పనిచేసిన పాతవారిని కాదని కొత్తవారితో భర్తీ చేస్తుండటం గమనార్హం. కొందరు ఆర్సీవోలు చేతివాటం ప్రదర్శిస్తూ ఇదంతా చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బోధన అవకాశాలున్న చోట బోధనానుభవమున్న తమ సేవలనే కొనసాగించాలని పాతవారు కోరుతున్నారు.

**మాకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి: గెస్ట్, పార్ట్‌టైం ఉద్యోగులు**

సుదీర్ఘ బోధనానుభవం, గురుకులాలకు తాము అందించిన సేవలకు గుర్తింపుగా ఖాళీల భర్తీలో తమకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని గెస్ట్, పార్ట్‌టైం ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమను పరిగణనలోకే తీసుకోకుండా కొత్తవారిని నియమించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ నియామకాలను అడ్డం పెట్టుకుని ఆర్సీవోలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికీ గత జూన్, జూలై నెలల వేతన బకాయిలు తమకు చెల్లించలేదని వివరిస్తున్నారు.

### పాతవారికి డెమోల నిర్వహణలో మర్మమేమిటి?

ఖాళీలున్న చోట అప్పటికే పనిచేసిన, సుదీర్ఘ బోధన అనుభవమున్న అభ్యర్థులను కాదని, తిరిగి కొత్తగా డెమోలను నిర్వహిస్తూ కొత్త అభ్యర్థులతో ఆయా పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఒక్కో పోస్టుకు 50 వేల నుంచి లక్ష వరకు వసూలు చేస్తూ కొత్త వారితో ఆయా ఖాళీలను నింపుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేరుకే డెమోలను నిర్వహిస్తూ, చివరికి డబ్బులిచ్చిన వారినే ఎంపిక చేస్తున్నారని బాహాటంగానే ప్రచారం కొనసాగుతున్నది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మైనార్టీ గురుకులానికి చెందిన ఓ ఉన్నతాధికారి ఇదే రీతిన ఉద్యోగావకాశం కల్పిస్తామని చెప్పి నిరుద్యోగ అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేశారని, అది బయటకు పొక్కడంతో కేసుల వరకూ దారితీసింది. కమలాపూర్ గురుకులంలోనూ డబ్బులు తీసుకొనే పోస్టుల భర్తీ చేపట్టారని గతంలో పనిచేసిన గెస్ట్ ఫ్యాకల్టీలు ఆరోపణలు చేస్తున్నారు.

### గౌరవ వేతన ఫ్యాకల్టీని తొలగించండి

- ఖాళీలను డిప్యూటేషన్‌తో భర్తీ చేయాలి
- 'సాంఘిక సంక్షేమ' సొసైటీ కార్యదర్శి వర్షిణి ఉత్తర్వులు
- ఒక్కరోజు వెయ్యి మంది గెస్ట్ లెక్చరర్ల తొలగింపు దారుణం
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): నాన్ రెగ్యులర్ స్టాఫ్, అదనపు స్టాఫ్, పార్ట్‌టైమ్, గెస్ట్ ఫ్యాకల్టీతోపాటు గౌరవ వేతనం కింద సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిని తక్షణమే తొలగించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి వర్షిణి ఆదేశించారు. గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌కు ఉత్తర్వులు జారీచేశారు. గురుకులాల్లో బోధన సిబ్బంది ఎంతమేరకు అవసరమో వెల్లడించాలని సూచించారు. సిబ్బందిని తొలగించడం ద్వారా ఏర్పడిన ఖాళీల్లో రెగ్యూలర్ సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమిస్తామని ఆ సొసైటీ జాయింట్ సెక్రటరీ తెలిపారు.

**పేద విద్యార్థుల ఉసురు తగుల్తది**

ఒక్క రోజులోనే వెయ్యి మంది గెస్ట్ లెక్చరర్లను తొలగించడం దారుణమని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. మూడు నెలలుగా వీరికి వేతనాలు కూడా ఇవ్వలేదని మంగళవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'ఈ రోజు సీఎం రేవంత్‌రెడ్డి ఆధీనంలో ఉన్న ఎస్సీ గురుకులాల నుంచి దాదాపు వెయ్యి మందికిపైగా గెస్ట్ లెక్చరర్లను తీసివేయడం జరిగింది. వీళ్లకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదంట. వీళ్లందరూ తెలంగాణలో పలుచోట్ల ధర్నాలకు దిగారు. వివక్షపూరిత చర్య వల్ల ఎన్నో అకాడమీలు మూతపడి తెలంగాణ గురుకులాల్లో చదువుతున్న లక్షల మంది ప్రతిభావంతులైన ఎస్సీ బహుజన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతున్నది. అయినా, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎస్సీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏమీ పట్టనట్టు గుర్రుపెట్టి నిద్రపోతూనే ఉన్నారు. ఈ పేద విద్యార్థుల కుటుంబాల ఉసురు తగుల్తది. మీరు ఇట్లనే నిద్రపోతే చరిత్రలో దళితద్రోహులుగా మిగిలిపోతారు. ఖబర్దార్' అని ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

# కొత్తగా 'తెలంగాణ విద్యాకమిషన్'

- విధివిధానాలను ఖరారు చేస్తూ జీవో జారీ
- కమిషన్‌కు ఒక చైర్మన్, ముగ్గురు సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ప్రీప్రైమరీ నుంచి సాంకేతిక విద్య, యూనివర్సిటీ స్థాయి విద్య వరకు నూతన విద్యావిధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'తెలంగాణ విద్యా కమిషన్'ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ విధివిధానాలను ఖరారు చేస్తూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మంగళవారం జీవో 27ను విడుదల చేశారు. ఈ కమిటీకి ఒక చైర్‌పర్సన్, ముగ్గురు సభ్యులను నియమిస్తారు. రెండేండ్ల కాల పరిమితితో ఈ కమిషన్ పనిచేయనున్నది. హెచ్‌వోడీ స్థాయి ఐఏఎస్ అధికారి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. యూనివర్సిటీల్లో పబ్లికేషన్ల సంఖ్య తగ్గడం, పరిశోధన కార్యకలాపాలు కుంటుపడుతుండటంతో వర్తమాన మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు కొరవడుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సమగ్ర మార్పులకు రోడ్ మ్యాప్‌ను ఖరారు చేయనున్నది. ఆ బాధ్యతలను విద్యాకమిషన్‌కు అప్పగించింది. ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ఈ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేయనున్నది.

# కొనసాగింపా? కొత్త వారా?

**8తో ముగియనున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి పదవీకాలం**

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా పార్థసారథిని కొనసాగిస్తారా? కొత్త వారిని నియమిస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. పార్థసారథి పదవీ కాలం ఈ నెల 8తో ముగియనున్నది. పార్థసారథిని మరో ఏడాదిపాటు కొనసాగించే అవకాశం చట్టం ప్రకారం ఉన్నది. పార్థసారథి పదవీ కాలంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇప్పటికే సీఎంవోకు ఫైల్ పంపించినట్టు సమాచారం. దీనిపై వచ్చే శుక్ర, శని వారాల్లో తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. వచ్చే సంవత్సరంలో స్థానిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ, ఓటరు జాబితా తయారీకి కసరత్తు ప్రారంభమైంది. అఖిలపక్ష సమావేశం నిర్వహించి పార్టీల అభిప్రాయాలు కూడా సేకరించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ పదవి కీలకంగా మారనున్నది.

# డీఎస్సీలో తప్పుల భయం..!

- ఫైనల్ కీ విడుదలలో జాగ్రత్త
- ఒకటికి రెండు సార్లు పరిశీలన

హైదరాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాల వెల్లడిపై సర్కారు ఆచీతూచీ అడుగులేస్తుంది. ముఖ్యంగా తప్పుల భయం ప్రభుత్వాన్ని పట్టి పీడిస్తుంది. ఇప్పటికే ఎస్జీటీ పరీక్షల్లో ఏకంగా 18–19 ప్రశ్నలు పునరావృతం కాగా, ఈ అంశంలో సర్కారు అబాసుపాలైంది. దీంతో ఫైనల్ కీని ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తున్నారు. ఫైనల్ కీ, ఫలితాలు విడుదల విషయంలో ఏ చిన్న పొరపాటు జరగకుండా అధికారులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు. కాగా, తుది కీ ని పాఠశాల విద్యాశాఖ మంగళవారం రాత్రి లేదా బుధవారం విడుదల చేసే అవకాశాలున్నాయి. ఈ నెల రెండో వారంలో ఫలితాలు ప్రకటించనున్నారు. 28 వేలకుపైగా అభ్యంతరాలు రావడంతో మార్కులేమైనా కలుస్తాయా.. అన్న ఆతృత అభ్యర్థుల్లో కనిపిస్తుంది. ఫైనల్ కీ తర్వాత డీఎస్సీ మార్కులు, టెట్ మార్కులను కలిపి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్(జీఆర్ఎల్)ను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత 1:3 మెరిట్ జాబితాను విడుదల చేసి అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు.

# ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి రాజీనామా

- మరొకరికి బాధ్యతలు అప్పగింతపై మనస్తాపమా?
- కాంట్రాక్టులు, నిర్మాణాలపై వ్యత్యాసాలే కారణమా?

హైదరాబాద్, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు పేర్కొంటూ సోమవారమే ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి రాజీనామా లేఖను అందజేశారు. 2017లో ఉద్యోగ విరమణ చేసినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయనకు ఎక్స్‌టెన్షన్ ఇచ్చి ఆ పదవిలో కొనసాగించింది. గణపతిరెడ్డి ఆర్‌అండ్‌బీలో జాతీయ రహదారులు, భవనాల విభాగం బాధ్యతలు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సచివాలయం, కమాండ్ కంట్రోల్ భవనం, అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, వరంగల్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన, కలెక్టరేట్లు, టిమ్స్ తదితర భవనాల నిర్మాణాల సమయంలో గణపతిరెడ్డి ఈఎన్సీగా ఉన్నారు. ఆగస్టు 27 నుంచి 31 వరకు ఆయన సెలవులపై వెళ్లొచ్చేసరికి జాతీయ రహదారులు, భవనాల విభాగం పూర్తిస్థాయి బాధ్యతలను చీఫ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మనస్తాపానికి గురై పదవికి రాజీనామా చేసినట్టు సమాచారం. మరోవైపు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ, టిమ్స్ దవాఖానల నిర్మాణాల్లో కాంట్రాక్టు ఏజెన్సీతో కుదుర్చుకున్న ఒప్పందాలకు, జరిగిన నిర్మాణాలకు భారీగా వ్యత్యాసం ఉండటంతోపాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన వివిధ నిర్మాణాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో గణపతిరెడ్డి రాజీనామా చేసినట్టు ప్రచారం జరుగుతున్నది.